# అత్తవారిల్లు

అప్పికట్ల సూర్యనారాయణమూర్తి గారు

చేతిలో కార్డుపట్టుకొని రామరాజు లోనికి వచ్చెను. అప్పుడే సీతమ్మ కాఫీతయారుచేసి 'రండి అయింది' అని ముందటింటి వైపునకు వచ్చుచుండెను.



"ఉత్తరం వచ్చింది" అని రామరాజు మెల్లగా ననెను.

సీత—ఎవరిదగ్గరనుంచి?

రాజు—చెప్పకో చూతాం;

సీత—బహుశా మానాన్నగారి దగ్గరనుండి అయివుంటుంది.

రాజు—లేదు. గోవిందరావుదగ్గర నుంచి

సీతమ్మ ఆమాట వినడంతోనే కొంచెం నిస్పృహపడ్డాది. "ఏమీ! యెందుకు రాలేదూ. ఇంక నాలుగురోజులే కదా ఉంది పండుగ?" అని అనుకుంటూ రామరాజుతో లోనికి పోయింది. తరువాత వీరిరువురు కాఫీ పుచ్చుకొనేగదిలో కూర్చొని కాఫీ తాగుచున్నారు.

కాని సీతమ్మకు మట్టుకు యేమీ తోచనట్లు తడబడుచున్నది. రామరాజుకికూడా కొంచెం మనసులో అదేదో ఒకలాగ ఉంది.

సీత—ఏమిటండీ యిలా చేశారు; మావాళ్లు యీ మాటు?

రాజు—అయితే నేమిలే; పండుగ యిక్కడ కూడదా యేమిటి?

సీత—ఎక్కడఅయితే ఏమని మీ కుంటుంది. వచ్చి యెన్నాళ్లయిందో తెలుసునా? ఇన్నాళ్లదాకా మావాళ్లు ఊరుకోడం చూస్తే...

అని కొంచెము ముఖం వేలవేసుకొని బొటనవ్రేలు క్రింది రాస్తూ చూస్తున్నాది. ఇంతలో రామరాజు ఆమెవైపు చూచుసరికి ఆమెకంటినుండి చిన్నకాలువ కూడా ప్రవహించనారంభించినది. నిజం చెప్పకపోవడం తప్పుచేసినానని రామరాజు సీతను దగ్గరకు

తెచ్చుకొని "లేదులే, మామయ్యగారు రాశారు. యిదిగో రేపు యిలాంటప్పటికి మీ అమ్మ చల్ల చేస్తూ ఉంటే, గోకురు కోసానికి నువ్వు, రత్నం—

సీత—పోనీలెండి, మీ మాట లెప్పుడు యిలాగే. 'నాయనా అన్నానికి రా' అనిమీఅమ్మ పిలిచినప్పుడో?

* *

రాత్రి యేడుఘంటలయింది. రామరాజు అప్పుడే వీథులోనుండి వచ్చి, గదిలోనికి వెళ్లేసరికి, సీత పెట్టెలో తనబట్టలన్నియు సర్దుకొనుచుండెను.

రాజు—హార్మోని మరిచిపోకు.

సీత—హార్మోని యెందుకు? అక్కడ నేను పాడాలా యేమిటి?

రాజు—మీనాన్నకి పాటఅంటే సరదా. తీసుకెళ్లు. ఇక్కడ నేనేమిటిచేస్తాను, నువ్వు లేనిదే? అదెందుకు తీస్తున్నావు?

సీత—ఏది ?

రాజు—మరేది. నువ్వు యిప్పుడు బట్టమడతలో పెడుతున్నది.

సీత—అది లేకపోతే యేలాగు? నారాజు నాదగ్గర ఉండొద్దూ!

రాజు—సరేలే—నీవస్తువులన్నీ పెట్టుకో, ఏదీ మరచిపోవద్దు. మళ్లీ యెన్నాళ్లకువస్తావో!

ఈమాట అనేసరికి ఆమెభావంలో మార్పు కలిగింది. మారేమీ మాటాడలేదు.



పెట్టె తాళం వేసేసింది. రామరాజు కూర్చొన్న సోఫాదగ్గరకు వచ్చి అతనికాళ్లదగ్గర కూర్చొని, అట్టే అతనిమొగంవేపు చూస్తూన్నది.

రాజు—ఏం? అలాగ చూస్తున్నావు. రేపు యిల్లాంటప్పటికి మీరత్నం అక్కయ్య ఒచ్చిందని అతిసంతోషంతో గెంతుతాడు. నువ్వు పాడుతూఉంటే—

సీత మాట్లాడలేదు. అట్లే చూస్తున్నాది.

రాజు—మీఅన్నయ్య స్టేషనుకు వస్తాడేమో. క్రిందటిమాటు మీ నాన్న ఒచ్చారు కదూ!

సీత యింకను అట్లే చూచుచున్నది. మాట్లాడలేదు.

రాజు—జట్కా దిగేసరికి—వాకిట్లోనే ఉం టుంది మీ అమ్మ; రెండు చేతుల్తో కౌగ లించుకుంటుంది.

అప్పటికి యేమీ మాట్లాడలేదు. ముఖ వైఖరిచూస్తే యేడ్పువచ్చేటట్టు ఉంది. అది చూచి రామరాజునకు యేమియు తోచక— "సీతా! యెందుకే అలాగున్నావు" అనేటప్ప టికి ఆమె రెండు చేతులూ మెడచుట్టూ వేసి "రాజ్యం" అని వెక్కి వెక్కి యేడ్చుచున్నది. కాని అతను ధైర్యవంతుడు. మనసులో ఆమె ను విడుచుటకు విచారముగలవాడయినా, పైకి "అలా, యేడవకూడదు—తప్పు. పుట్టిం టికి వెళ్లేటప్పుడు యెవరేనా యేడుస్తారా తప్పుకదూ!"

తప్పో, ఒప్పో ఆమెకు తెలియదు. కంటి వెంటమట్టుకు నీళ్లువస్తున్నాయి.

రాజు—అలా యేడవకు. ఇన్నాళ్లు నాదగ్గర ఉన్నావుకదా! మరికొన్నాళ్లు అక్కడ ఉండవాలా లేదా? కనీ పెంచారువాళ్లు.

ఇట్లిరువురు భావసముద్రంలో మునిగే టప్పటికి, వేళ యెంతయిందో వాళ్లకి తెలియ లేదు.

ఇంతట్లో "భోజనానికి వేళయింది రండి" అని క్రిందనుండి కేక రావడంతోనే వదల లేక వదలుతూ, రామరాజు, సీతమ్మ క్రిందికి దిగివచ్చినారు.

* * * *

రయిలువేళ అయింది. బండీ వాకిట్లో నిలబడ్డది. సామాన్లన్నీ దానిలో పెట్టడం కూడా అయినది. కాని రామరాజు, సీతమ్మ యింకా మేడ దిగలేదు. "వేళ అయింది" అని కేక క్రిందినుండి వచ్చింది. ఒకఅడుగు ముం దుకు, ఒకఅడుగు వెనకకు వేస్తూ సీతమ్మ దిగుచున్నది. "ఉత్తరాలు రాస్తారు కదూ" అని మరీమరీ చెప్పి, "అత్తమ్మగారూ వెళ్తా" నని, తనఅత్తగారివద్ద సెలవుపుచ్చుకొని, సీత బండియెక్కినది. రామరాజు స్టేషనువద్దకు వెళ్లి టిక్కెట్టుకొని, వెంటవెళ్లే మనిషితో 'జాగ్రత్త' అని హెచ్చరించి, రయిలుపోయిం దాకా అక్కడే ఉండెను. ఇంతలో రయిలు వచ్చింది. అంతలో రయిలు పోయింది. రామ రాజు ఒక్కడూ అక్కడ నిలబడి, కొంతసే పయ్యేటప్పటికి, ఇంటికివచ్చి, తనమంచం మీద వెల్లకిల పడుక్కున్నాడు.

* * * *

రెండునెలలు అయింది. సీతమ్మ పోస్టు జవానుకొరకు యెదురుచూస్తూ వీధి అరుగు మీద కూర్చుంది. అనుకున్నట్లే ఒక కవరు వచ్చింది. కాని యీమాటు తనపేర లేదు. వాళ్లనాన్నగారికి వచ్చింది. వెంకటచలంగారు కాలేజినుండి అప్పుడే యింటికి వచ్చిరి. బల్ల మీద పెట్టబడిన ఉత్తరంతీసి చదువుకొని యేమియు ననక జేబులోనుంచుకొని వీధిలో నికి వెళ్లిరి. సీతమ్మకుమాత్రం మనసు ఆందో ళనగా ఉంది. తనరాజ్యం రమ్మని రాసినారని మాత్రం ఊహచేసుకుంది. రాత్రి భోజనాల దగ్గర వెంకటచలంగారు "అమ్మన్నను త్వర లో పంపమని అల్లుడు వ్రాశినాడు."

కనకమ్మగారు మాత్రం అప్పుడే కూతు రిని పంపివేయవలెనని విచారిస్తున్నాది. భోజ

నాలు అయినతర్వాత. తల్లీ పిల్లా ఒకచోట కూర్చుండిరి.

కనకమ్మ—ఇవ్వాళ త్రయోదశికాదూ; అయితే నవమివెళ్లిన దశమినాడు వెళ్లవచ్చును.

సీత—నువ్వు యీమాటు నాతో రావాలి.

కనకమ్మ—నే నెందుకే మీవాళ్ల యింటికి?

"మీవాళ్లు" అనేసరికి సీతమ్మ కొంచెం కొత్త చూపు చూసింది. కాని ఏమీ అనలేదు. ఎంత కనిపెంచినా యింతేకదా అని అనుకుంటూ కనకమ్మ కంట నీరు పెట్టుకుంది. అది చూచి సీతమ్మకుకూడా యేడుపువచ్చింది. ఇక ఎవరిబాధ వారి కన్నీట్లో ప్రవహించిన తర్వాత రోజులు లెక్కపెడుతూ యిద్దరూ గడిపినారు.



* *

నవమి వెళ్లింది. దశమి వచ్చింది. సీతమ్మ ఆవేళ మెయిల్లో అత్తవారింటికి వెళ్లడానికి ఉంది. బట్టలన్నీ పెట్టెలో పెట్టుకొని పసుపుకొమ్ములు, కుంకుం మూటలోకట్టి యిచ్చినజరీ చీరకట్టుకొని నిలబడ్డాది. వాళ్ల నాన్నగారు వీధిలో బెంచీమీద కూర్చున్నారు. "చెల్లెమ్మా వేళయింది రా" అని వెంటగానున్న సీతమ్మ అన్నతొందరపెడుతున్నాడు. రత్నం అక్కడ నిలబడి చూస్తున్నాడు. ఏమితెలియదు. చిన్న పిల్లడు. కనకమ్మ కంటివెంట నీటి చుక్కలు రాలుతున్నాయి. కూతురు చూడకుండా ఉండవాలన్ని, యెంత ప్రయత్నం చేసినా అవి రావడం మానలేదు. సీతమ్మమాట చెప్పనే అక్కరలేదు. ఇంట్లో పెద్దది ముసలమ్మ "అలా యేడవకూడదు.తప్పు.యెవరింటికివాళ్లు వెళ్తారు" అని యెంతచెప్పినా వారిదుఃఖమునకు మేర లేదు. "అమ్మా వెళ్తాను" అనేమాట నోటినుండి వచ్చుచూ వచ్చుచూ గద్గదికంలో ఉండిపోయింది. "పదే చెల్లెమ్మా" అని అన్నయ్య తొందర చేయుచున్నాడు. ఇంక సీతమ్మ బండి యెక్కింది. బండి నడవసాగింది. కనకమ్మ కళ్లు మూతవెయ్యకుండా తూము దగ్గర బండీ మళ్లినంతవరకు చూస్తూ వీధి అరుగుమీద నిలబడియుండెను. రాధారిమనుష్యులు యెవరు వెళుతారో ఆమెకు తెలియదు. ఎదురుగుండా ఉన్నవారు అరుగులమీద నిలబడ్డారు. ఎవరున్నారో తెలియదు. సీతమ్మ బండీలో అట్టే యుండెను. కొంతసే ఫ

టప్పటికి, బండీ మళ్ళిపోయింది. కనకమ్మ పైటచెరగంతా తడేను. సీతమ్మ కాటిక అంతా చీరకొంగుకే.

* * * *



రాత్రి యెనిమిదిఘంట లయింది ఊరికి వచ్చేసరికి. బండిలో సామానంతా లోపలికి వచ్చేసింది. భోజనాలు అయినాయి. తరువాత మేడమెట్లొక్కటి యెక్కి సీతమ్మ గదిలోకి వచ్చింది. వెళ్లేసరికి—ముహూర్తమాత్రంలో రామరాజు, సీతమ్మ ఒకరిలో నొకరున్నారు. సీతమ్మ సంతోషానికి మేరలేదు. రామరాజు ఆనందానికి అడ్డులేదు.

రాజు—అయితే నాకోసానికియేమిటి తెచ్చావు?

సీత—మీ కేమిటి కావాలో అదే.

రాజు—ఏమిటిగదా!

సీత—'నేనే' అనేసరికి రామరాజు సీతనుమరీ దగ్గరకు తీసుకున్నాడు.

రాజు—అయితే యీకాటుక మరక లేమిటీ. చీరకొంగుకి?

సీతమ్మ జవాబుచెప్పలేదు. వేరు విధంగా ప్రత్యుత్తరం ఇచ్చుచున్నది.

సంపూర్ణము

# పలుకరాదమ్మా!

గేయము (హారిత కృతము)

శకుంతల—

చెలువుగని తొలివలపుఁ గొంటినో!
వలచిచెలువము కలిమిఁగంటినో!
చెలువువలపుల చెలిమినేమో
తలఁపుఁ దలఁపునఁ బులకరింతలు
పలుకరాదమ్మా! నావలపుదలఁపు.

ప్రియంవద—

తలఁపులేని పలుకువెలయదు
పలుకులేని తలఁపు దెలియదు
తలఁపుఁబలుకులు దారసిల్లినఁ
దొలకరించును బులకరింతలు
పలుకవేమమ్మా! నీవలపు సొలపు.